సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం, 28, మే, 2025



చీనీ టన్ను రూ.34,120
అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34,120, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



బాబు స్వార్థం.. సీమకు అన్యాయం
సీఎం చంద్రబాబు స్వార్థానికి రాయలసీమకు అన్యాయం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవాకు లైనింగ్ వల్ల తీరని నష్టం జరుగుతుందంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
32.3°/21.8°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భూసేకరణ పనులు వెంటనే పూర్తి చేయండి
- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



భూసేకరణ పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణ పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌హెచ్ -342, ఎన్‌హెచ్-716జీ రహదారులతో పాటు పలు జాతీయ రహదారులు, వివిధ ప్రాజెక్టుల భూసేకరణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూకేటాయింపు ప్రతిపాదనలపై వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక రూపొందించి రెవెన్యూ డివిజనల్ అధికారులకు, కలెక్టరేట్‌లో అందజేయాలని ఆదేశించారు. ఎన్‌హెచ్-342 జాతీయ రహదారికి సంబంధించి బుచ్చయ్యగారిపల్లి గ్రామస్తులకు ఇవ్వాల్సిన పరిహారం, పుట్టపర్తి మండలం అమగొండపాళ్యం రెవెన్యూ గ్రామస్తులకు ఇవ్వాలని పరిహారం పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ పనులన్నీ వెంటనే పూర్తి చేసి పరిహారం చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్ కుమార్, శర్మ, మహేష్, ఎన్‌హెచ్ ఏఐ పీడీ అశోక్ కుమార్, అధికారులు మల్లికార్జునరావు, బి.నాగరాజు, గిడ్డయ్య, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సీటు రాదేమోనని.. విద్యార్థిని ఆత్మహత్య



హేమావతి (ఫైల్)

పరిగి: పదో తరగతిలో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం మండలంలోని కొడిగెనహళ్లి ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాలు మేరకు... కొడిగెనహళ్లి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న వెట్టి గోపాలప్ప కుమార్తె వెట్టి హేమావతి(15) 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆమెకు 379 మార్కులు వచ్చాయి. అయితే ఇంకా మంచి మార్కులు రావాల్సి ఉండేదని హేమావతి నిత్యం బాధపడేది. ఇంటర్‌లో చేరేందుకు మంచి కళాశాలలో సీటు వస్తుందో రాదోనని ఆందోళన చెందేది. ఇదే విషయాన్ని తల్లిదండ్రులతో చెబుతూ తరచూ బాధపడేది. ఈ నేపథ్యంలోనే ఇంటర్‌లో మంచి కళాశాలలో సీటు రాదేమోనన్న భయంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హేమావతి తండ్రి గోపాలప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగడు తెలిపారు.


'తమ్ముళ్ల' చిల్లర వేషాలు
- వైఎస్సార్ సీపీ నేతల పేర్లతో టీడీపీ సభ్యత్వ కార్డులు
- వాటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న వైనం



టీడీపీ నేతలు కుట్ర పన్ని తయారు చేయించిన సభ్యత్వ కార్డు

చిలమత్తూరు: తెలుగు తమ్ముళ్లు చిల్లర వేషాలు వేస్తున్నారు. తమ మాట వినని ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేస్తున్నారు. చివరకు వైఎస్సార్ సీపీ నేతల పేర్లతో టీడీపీ సభ్యత్వ కార్డులు తయారు చేయించి వాటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. తాజాగా వైఎస్సార్ సీపీకి చెందిన చిలమత్తూరు- 2 ఎంపీటీసీ సభ్యురాలు సనమ్‌హుస్నా భర్త షాకీర్‌తో పాటు ఆయన తల్లి పేరుతో కూడా టీడీపీ సభ్యత్వ కార్డులు పంపించారు. వాటిని టీడీపీ నేతలే సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన షాకీర్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తాను ఎప్పుడూ టీడీపీ సభ్యత్వం కోసం దరఖాస్తు చేయలేదని, పార్టీ మారాల్సిన ఖర్మ తనకు పట్టలేదన్నారు. టీడీపీ నేతలు చిల్లర పనులు మానుకోవాలని హితవు పలికారు. తన రాజకీయ ప్రయాణం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే ఉంటుందని స్పష్టం చేశారు. టీడీపీ నేతల విష ప్రచారాలు నమ్మవద్దని ప్రజలను కోరారు.


కరోనా.. హైరానా!



- హిందూపురానికి చెందిన ప్రకాష్ స్థానికంగా గిఫ్ట్ అండ్ నావల్టీస్ దుకాణం నడుపుతున్నాడు. ప్రతి చిన్న పనికీ సమీపంలో ఉన్న బెంగళూరుకు వెళ్లేవాడు. కానీ ఇప్పుడు ఈ ఊరి పేరు చెబితేనే భయపడిపోతున్నాడు. ఇటీవల అక్కడ కరోనా కేసులు బయటపడటంతో ఏదైనా కావాలంటే అనంతపురం వెళ్తున్నాడు.
- పుట్టపర్తికి చెందిన శ్రీనివాసులు ఉపాధి నిమిత్తం రోజూ రైలులో సిలికాన్ సిటీగా పేరుగాంచిన బెంగళూరుకు వెళ్లివచ్చేవాడు. అక్కడ కరోనా కేసులు నమోదుకావడంతో స్థానికంగానే పనులు చేసుకుంటున్నాడు. బెంగళూరుకు వెళ్తే కూలి ఎక్కువ వస్తుంది కదా అని ప్రశ్నిస్తే... ఆ డబ్బులొద్దు... ఆ జబ్బు వద్దంటున్నాడు.

..ఇలా వివిధ పనుల నిమిత్తం నిత్యం బెంగళూరుకు రాకపోకలు సాగించే జిల్లా వాసులు ఇప్పుడు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కానీ బెంగళూరు నుంచి వచ్చేవారు మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాకు వచ్చి వెళ్తున్నారు. దీంతో జిల్లా వాసులు హైరానా పడుతున్నారు. కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- రోజూ బెంగళూరుకు జిల్లా వాసుల రాకపోకలు
- కార్లు, రైళ్లు, బస్సుల్లో తిరుగుతున్న వైనం
- అక్కడ పాజిటివ్ కేసులతో భయం భయం
- పుట్టపర్తి, హిందూపురం వాసుల్లో ఆందోళన
- ముందస్తు చర్యలపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం



సాక్షి, పుట్టపర్తి

కరోనా మహమ్మారి మళ్లీ పడగ విప్పుతోంది. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో జడలు విప్పుకుంటోంది. ఇప్పటికే కర్ణాటకలో 47 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో జిల్లా వాసుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటి వరకు అధికారులు ముందస్తు నివారణ చర్యల గురించి ప్రస్తావించకపోవడంతో మనం భద్రమేనా..అన్న ప్రశ్న తలెత్తుతోంది.

సరిహద్దు నుంచి నిత్యం రాకపోకలు..
జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది విద్య, ఉపాధి కోసం బెంగళూరు, చిక్కబళ్లాపుర, దొడ్డబళ్లాపుర, యలహంక వెళ్లి వస్తుంటారు. కార్లు, రైళ్లు, బస్సుల్లో ప్రయాణిస్తారు. దీంతో మనిషి నుంచి మనిషికి సులువుగా సోకే కరోనా వైరస్ ఇక్కడి ప్రాంతాలకు విస్తరించే ప్రమాదం లేకపోలేదు. గత 2020, 2021లో కరోనా వైరస్ చేసిన మరణ మృదంగం తలుచుకుంటే ప్రజలకు నిద్ర పట్టడం లేదు. మరోసారి అలాంటి పరిస్థితి వస్తుందేమోనని భయం భయంగా గడుపుతున్నారు.

జిల్లా వాసుల్లో టెన్షన్..
కరోనా వంటి ప్రమాదకర వైరస్ సమీపంలోని బెంగళూరు వరకు వచ్చిందనే విషయం తెలియగానే.. జిల్లాలోని హిందూపురం, పెనుకొండ, గోరంట్ల, పుట్టపర్తి ప్రాంతాల్లో టెన్షన్ మొదలైంది. పొరుగు రాష్ట్రంలో వైరస్ తొంగి చూడటంతో ఇక్కడి జనం ఉలిక్కిపడ్డారు. జిల్లా నుంచి రైళ్లు, బస్సులు, కార్లలో రోజూ వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా జిల్లా కేంద్రం పుట్టపర్తి నుంచి రోజూ సగటున వంద వరకు కార్లు విదేశీయులతో బెంగళూరు విమానాశ్రయం వెళ్తుంటాయి. ఈ క్రమంలో విమానాల్లో వచ్చిన వారి నుంచి వైరస్ సంక్రమిస్తుందన్న భయం అందరినీ వెంటాడుతోంది.

పెరిగిన డిమాండ్..
కొత్తగా వైరస్ కేసులు పక్కనే ఉన్న బెంగళూరులో తేలడంతో మాస్క్‌లు, శానిటైజర్లకు డిమాండ్ పెరిగింది. ఎవరికి వారుగా ప్రజలు స్వీయ నిర్బంధంలోకి వెళ్లడంతో పాటు జ్వరం, జలుబు లక్షణాలు కనిపించిన వెంటనే మాస్క్‌లు ధరించి బయటికి వస్తున్నారు. అంతేకాకుండా ప్రైవేటు కార్యాలయాల్లో శానిటైజర్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ముందు తరహాలో అనుమతించడం లేదు. రెండు మూడు రోజుల్లోనే పుట్టపర్తిలో మార్పు వచ్చింది. గతంలో కరోనా వైరస్ విజృంభించిన తీరు గురించి పదే పదే చర్చించడం మొదలుపెట్టారు.

ముందస్తు చర్యలు తీసుకోని ప్రభుత్వం..
కరోనా వంటి ప్రమాదకర వైరస్‌లు ప్రబలిన సమయంలో గతంలో వైఎస్సార్ సీపీ సర్కారు పకడ్బందీ చర్యలు తీసుకుంది. ప్రజారోగ్యమే పరమావధిగా కఠినంగా వ్యవహరించింది. పాజిటివ్ కేసుల గుర్తింపు మొదలు క్వారంటైన్, ఆస్పత్రుల్లో చికిత్స అవసరమైన వారికి ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేయడం, కోవిడ్ కేర్ సెంటర్లు, ఆహారం సరఫరా, కూరగాయల పంపిణీతో పాటు అత్యవసర సమయాల్లోనూ వలంటీర్ల ద్వారా ప్రతి నెలా పింఛన్ అందజేయడం వంటి సహాయక చర్యలు చేపట్టింది. అంతేకాకుండా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలపై కూడా ఆంక్షలు విధించి జిల్లా వాసులను కాపాడింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు అలాంటి చర్యలేవీ తీసుకోవడం లేదు. కనీసం కరోనా టెస్టులు చేసేందుకు అవసరమైన కిట్లు కూడా అందుబాటులో ఉంచలేదు. దీంతో చిన్న జ్వరం వచ్చిన వారు కూడా హడలిపోతున్నారు. పైగా ఇప్పటికే ఉన్న ఆరోగ్యశ్రీని కూడా రద్దు చేసింది. దీంతో ప్రజల్లో వైరస్‌ల భయం రెట్టింపయ్యింది. ప్రభుత్వం నుంచి భరోసా అనుమానమే అన్న భయం వెంటాడుతోంది.

స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలి
పొరుగు రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నా...మనం భయపడాల్సిన పని లేదు. స్వీయ జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. ప్రతి ఒక్కరూ మాస్క్ తప్పనిసరిగా వినియోగించాలి. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు జనావాస ప్రాంతాల్లో భౌతిక దూరం పాటించాలి. మాస్కు లేకుంటే ఆస్పత్రుల్లో ప్రవేశం నిషిద్ధం. గతంలో కరోనా వైరస్ సమయంలో పాటించిన జాగ్రత్తలను తిరిగి కొనసాగించండి. వైరస్ సోకక ముందే అప్రమత్తంగా ఉండటం మంచిది. అయితే వైరస్‌తో ఏమీ కాదనే నిర్లక్ష్యం వద్దు.
– డాక్టర్ ఫిరోజాబేగం, డీఎంహెచ్‌ఓ

15 మండలాల్లో వర్షం



చిలమత్తూరు సమీపంలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్/చిలమత్తూరు: తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం జిల్లాలోని 15 మండలాల పరిధిలో తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా లేపాక్షి మండలంలో 7.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక అగళి 6.4 మి.మీ., గోరంట్ల 6.2, గుడిబండ 6, పరిగి 4.2, హిందూపురం 3.4, సోమందేపల్లి... సీకేపల్లి 2.8, మడకశిర 2.6, రొళ్ల 2.4, అమడగూరు 2.4, బుక్కపట్నం 1.8, తనకల్లు 1.8, ముదిగుబ్బ 1.4, సోమందేపల్లి 1.4, రొద్దం మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో మూడు రోజులు ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెల్లడించారు. ఇక జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు.

జిల్లాకు వర్షసూచన..
రాగల ఐదు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేలికపాటి నుంచి మోస్తరు వర్షసూచన ఉందని వెల్లడించారు. గంటకు 16 నుంచి 20 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచే అవకాశం ఉందన్నారు.

వ్యవసాయ సలహాలు..
ఈనెల 26న నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచించారు. విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు గాలులు వీచే అవకాశం ఉన్నందున అరటి, బొప్పాయి లాంటి వాటికి ఊతకర్రలు పెట్టుకోవాలని, రాలిన మామిడి కాయలు వెంటనే సేకరించి విక్రయించుకోవాలన్నారు. జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని భూసారం పెంచుకోవాలన్నారు. జీవాల్లో ఈటీ, షీప్ పాక్స్ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున టీకాలు వేయించుకోవాలన్నారు. పిడుగులు పడే పరిస్థితి ఉన్నందున రైతులు, కాపర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పుట్టపర్తిలో దాహం కేకలు



ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు
- ఎమ్మెల్యే సింధూరారెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు

పుట్టపర్తి టౌన్: ఆధ్యాత్మిక కేంద్రంగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన పుట్టపర్తిలో దాహం కేకలు మిన్నంటాయి. వేసవి ముగిసి వర్షాకాలం ప్రారంభమైనా..చాలా వార్డుల్లో తాగునీటికి జనం అల్లాడిపోతున్నారు. తాజాగా మంగళవారం 5 వార్డు కుమ్మరిపేట మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. నాలుగురోజులుగా తాగేందుకు నీరు లేక అల్లాడిపోతున్నా ఎవరికీ పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలోనే పల్లె సింధూరారెడ్డికి వ్యతిరేకంగా 'ఎమ్మెల్యే డౌన్ డౌన్' అంటూ నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ...నాలుగు రోజులుగా బోరు మోటర్ మరమ్మతుకు గురైందని, దీంతో తమకు తాగునీటి ఇబ్బందులు తలెత్తాయన్నారు. నాలుగురోజులుగా అధికారులకు, ఎమ్మెల్యే కార్యాలయానికి సమస్య చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాకుండా గతంలోనూ తమకు ఇష్టమొచ్చినప్పుడు నీరు వదిలేవారని, దీంతో కూలి చేసుకునే తాము పనులు మానుకుని నీటికోసం ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సింధూరారెడ్డి స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని, లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. మహిళల ఆందోళన గురించి స్థానిక కౌన్సిలర్ సూర్యాగౌడ్ మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా... ఆయన స్పందించి త్వరగా మోటర్ మరమ్మతు చేయించి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

ప్రయాణికులపై 'మహా' దెబ్బ

- మహానాడుకు జిల్లా నుంచి 167 ఆర్టీసీ బస్సులు
- ఎక్కువగా 'పల్లె వెలుగు' బస్సులను పంపిన వైనం
- రెండు రోజులు ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



మడకశిర: టీడీపీ మహానాడు దెబ్బ ఆర్టీసీ ప్రయాణికులపై పడింది. మంగళవారం కడపలో మహానాడు ప్రారంభం కాగా, గురువారం ముగింపు సభ జరగనుంది. ఇందుకోసం భారీగా జన సమీకరణ చేయాలని టీడీపీ నేతలు భావించారు. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించారు. అయితే జనాన్ని తరలించేందుకు ప్రైవేటు వాహనాలైతే ఎక్కువ మొత్తం వెచ్చించాల్సి వస్తుందని భావించిన 'తెలుగు తమ్ముళ్లు' ఆర్టీసీ బస్సులపై దృష్టి సారించారు. జిల్లాలోని ఆరు డిపోల నుంచి దాదాపు సగం బస్సులను మహానాడుకు సిద్ధం చేశారు. దీంతో గురు, శుక్రవారాల్లో జిల్లాలోని ఆర్టీసీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

'పల్లె వెలుగు'లే ఎక్కువ..
జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను ఎంచుకున్న టీడీపీ నేతలు అందులోనూ ఖర్చు తక్కువగా ఉంటుందని 'పల్లె వెలుగు'లకే మొగ్గు చూపారు. మొత్తంగా జిల్లాలోని ధర్మవరం, కదిరి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి డిపోల పరిధిలోని 167 బస్సులను మహానాడు కోసం తీసుకున్నారు. ఇందులో ధర్మవరం డిపో నుంచి 30, హిందూపురం డిపో నుంచి 30, కదిరి డిపో నుంచి 50, మడకశిర డిపో నుంచి 17, పెనుకొండ డిపో నుంచి 15, పుట్టపర్తి డిపో నుంచి 25 బస్సుల చొప్పున ఆర్టీసీ అధికారులు కేటాయించారు. ఇందులో ఎక్స్‌ప్రెస్ బస్సులు 48 ఉండగా, పల్లె వెలుగు బస్సులు 119 ఉన్నాయి.

ఆర్టీసీ అధికారుల అత్యుత్సాహం..
ఆర్టీసీ అధికారులు బస్సులను అద్దెకు పంపినా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్సులను పంపాల్సి ఉంటుంది. కానీ ఆర్టీసీ అధికారులు అత్యుత్సాహం చూపారు. టీడీపీ అధికారంలో ఉండటంతో అడిగేవారే లేరన్నట్లు వ్యవహరించారు. మడకశిర డిపోలో మొత్తం 30 బస్సులుండగా, ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోకుండా ఏకంగా 17 బస్సులను మహానాడుకు కేటాయించారు. కేవలం మిగిలిన 13 బస్సులు మాత్రమే ప్రయాణికులకు సేవలందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగిలిన డిపోల పరిధిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే మహానాడు ప్రభావంతో కొన్ని బస్సు సర్వీసులు రద్దు కానున్నాయి. ఎక్కువగా పల్లె వెలుగు బస్సులను తీసుకోవడంతో రెండు రోజుల పాటు ప్రయాణికులు గమ్యస్థానాన్ని చేరడానికి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు..
మహానాడుకు అత్యధికంగా ఆర్టీసీ బస్సులనే వాడుకోవడం కూటమి ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వందలాది ప్రైవేట్ బస్సులు, వాహనాలున్నా...ఆర్టీసీ బస్సులనే మహానాడుకు వినియోగించుకోవడం ప్రయాణికులను ఇబ్బందులు పెట్టడమేనని వాపోతున్నారు. అమరావతిలో ఇటీవల జరిగిన మోదీ సభకు కూడా ఆర్టీసీ బస్సులను పెద్ద ఎత్తున వినియోగించుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు రెండు రోజుల పాటు ఇబ్బందులు పడ్డారు. మళ్లీ టీడీపీ నాయకులు మహానాడు పేరుతో ఆర్టీసీ బస్సులను తీసుకుని ప్రయాణికులను ఇబ్బందులు పెడుతుండటం సర్వత్రా ఆగ్రహానికి గురిచేస్తోంది.

వైద్య,ఆరోగ్య శాఖలో లేఖ దుమారం

- 'సాక్షి' కథనాలతో అంతటా కలవరం
- అక్రమాలు వివరిస్తూ లేఖ విడుదల చేసిన ఉద్యోగులు
- వాట్సాప్‌లో హల్ చల్ చేస్తున్న అక్రమాల చిట్టా

పుట్టపర్తి అర్బన్: జిల్లా వైద్య,ఆరోగ్య శాఖలో కీలక అధికారి అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో ఉద్యోగులు కూడా సదరు అధికారి నిర్వాకాలన్నీ ఓ లేఖలో రాసి విడుదల చేశారు. ఈ లేఖ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. లేఖలో ఉద్యోగులు పేర్కొన్న వివరాల మేరకు...

- సదరు అధికారి తన సామాజిక వర్గానికి చెందిన కొందరు ఉద్యోగులను చేరదీసి వారి ద్వారా ముడుపులు భారీగా దండుకుంటున్నారు. తను ఆ స్థానానికి రావడానికి రూ.15 లక్షలు చెల్లించానని, వాటిని వసూలు చేసుకోకపోతే ఎలా.. అన్న రీతిలో కింది స్థాయి సిబ్బంది ద్వారా అవినీతికి పాల్పడుతున్నారు.
- హిందూపురంలో ఓ ప్రభుత్వ డాక్టర్ నర్సింగ్ హోం ఏర్పాటు చేయగా.. లైసెన్స్ కోసం రూ.10 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో పాటు ప్రతి ప్రైవేటు నర్సింగ్ హోం నుంచి తనకు రూ.20 వేలు అందేలా చూడాలని సిబ్బందికి హుకుం జారీ చేశారు.
- హెచ్‌డీఎస్ నిధులు దుర్వినియోగం చేసిన అధికారిపై నెల రోజుల కిందట పత్రికలో వార్త వచ్చినా... సదరు అధికారిపై ఎటువంటి విచారణ చేయకుండా భారీగా ముడుపులు అందుకొని ఫైల్ మూసేశారు.
- తన సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులను అడ్డుపెట్టుకొని సిబ్బంది విధులకు ఇబ్బంది పెడుతున్నారు.
- సదరు అధికారి వారాంతంలో తన సొంతూరుకు వెళ్తారు. శనివారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనంలోనే కదిరికి వెళ్లి... అక్కడి నుండి ఒక హెల్త్ అసిస్టెంట్ వాహనంలో తన సొంత ఊరికి వెళ్తారు. కదిరిలో ఆమె కుటుంబానికి కావాల్సిన బిర్యానీలు, భోజనాలను.. సదరు హెల్త్ అసిస్టెంట్ ఏర్పాటు చేస్తుంటారు. తిరిగి సోమవారం ఆమెను కదిరికి తీసుకురావడం కూడా ఆయన బాధ్యతే. అందుకు ప్రతి ఫలంగా స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న అతని భార్యను జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పీహెచ్‌సీలో నియమించారు. అంతేకాకుండా ఈ స్టాఫ్ నర్సు స్థానంలో పని చేసేందుకు ఒక ఏఎన్‌ఎం, ఒక ఎంఎల్‌హెచ్‌పీని సదరు అధికారి కేటాయించినట్లు తెలుస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధమైనా... తనకు సేవలందిస్తున్న ఉద్యోగి భార్య కావడంతో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీని బలవంతంగా విధులకు కేటాయించారని ఉద్యోగులు వాపోతున్నారు.
- సదరు అధికారి తనను కలిసేందుకు వచ్చే ఉద్యోగులను గంటల తరబడి నిలబెట్టడం, వారిపట్ల దురుసుగా ప్రవర్తించడం పరిపాటిగా మారిందని ఉద్యోగులు మండిపడుతున్నారు.

జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి



యోగా చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

- యోగాతోనే ఒత్తిడి జయించడం సాధ్యం: కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ చేతన్ సూచించారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పుట్టపర్తి గణేష్ కూడలిలోని మైనార్టీ షాదీ మహల్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో కలెక్టర్ చేతన్ పాల్గొన్నారు. స్వయంగా ఆసనాలు వేసి యోగా ప్రాముఖ్యాన్ని వివరించారు. యోగా చేసే వారు రోజంతా ఉత్సాహంగా ఉంటారని, యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అందువల్లే ప్రభుత్వం కూడా యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21 వరకు జిల్లాలో యోగాసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 18, 19 తేదీల్లో యోగాసన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో పాటు యోగా గురువులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధితులకు పరిహారం విడుదల

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వివిధ కేసుల్లోని బాధితులకు పరిహారం విడుదలైనట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విక్టిం కాంపెన్సేషన్ కింద 2022, అక్టోబర్ నుంచి 2023, డిసెంబర్ వరకూ వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పోక్సో, రేప్, కిడ్నాప్, ఉమెన్ ట్రాఫికింగ్, డౌరీ డెత్ కేసుల్లో బాధితులకు రూ.13.30 లక్షలు మంజూరయ్యాయి. జిల్లాలోని 85 మంది బాధితులకు గాను తొలి విడతలో 50 మందికి వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయనున్నారు. సదరు కేసులకు సంబంధించి కొత్తగా పరిహారం కోసం 2024, జనవరి నుంచి ఈ ఏడాది మే వరకూ ఉన్న బాధితులు ఎఫ్ఐఆర్ కాపీ, ఛార్జిషీట్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, జిరాక్స్ కాపీలను పుట్టపర్తిలోని వన్ స్టాప్ సెంటర్ (సఖి సెంటర్) లో అందజేయాలని పేర్కొన్నారు.

లింగ నిర్ధారణపై అవగాహన కల్పించండి

పుట్టపర్తి అర్బన్: లింగ నిర్ధారణపై ప్రజల్లో అవగాహన పెంచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం ఆదేశించారు. మంగళవారం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు, సూపర్ వైజర్లతో ఆమె జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. ఆడపిల్లల జననాలు తగ్గకుండా చూడాలని, ఇందులో క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీల సమన్వయంతో పనిచేయాలన్నారు. 'బేటీ బచావో–బేటీ పడావో'పై విస్తృత చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీల్లోనే కాన్పులు జరగాలని, కర్ణాటక సరిహద్దులో అబార్షన్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమనే బ్యానర్లు ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడికి రిమాండ్

రాప్తాడు: పోక్సో కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీహర్ష తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం బత్తలపల్లి గ్రామానికి చెందిన యువకుడు మూడే అనిల్‌కుమార్ నాయక్.. రాప్తాడు పంచాయతీ పరిధిలోని మైనారిటీ కాలనీలో నివాసముంటూ చెరుకు రసం బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. విషయాన్ని తల్లిదండ్రులకు బాలిక తెలిపింది. దీంతో యువకుడికి బాలిక తల్లిదండ్రులు సర్దిచెప్పారు. అయినా అతనిలో మార్పు రాలేదు. అతని వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో చివరకు బాలిక తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం పోక్సో యాక్ట్ కింద అనిల్‌కుమార్ నాయక్‌ను మంగళవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హిందూపురం: స్థానిక ముదిరెడ్డిపల్లికి చెందిన యువకుడు వేణు ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి తనను కాదని పుట్టింటికి వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం విషపూరిత ద్రావకం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. కాగా, కుటుంబంలో చోటు చేసుకున్న కలహాలపై రెండు రోజుల క్రితం కుటుంబసభ్యుల ఫిర్యాదుతో దంపతుల మధ్య పోలీసులు రాజీ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బాబు స్వార్థం.. సీమకు అన్యాయం

- హంద్రీ–నీవా లైనింగ్ పనులతో బీళ్లుగా మారనున్న రాయలసీమలోని 6 లక్షల ఎకరాలు
- కుప్పంకు నీరు తీసుకెళ్లేందుకు ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు
- అన్యాయాన్ని ప్రతిఘటించకపోతే రైతు మనుగడకే ముప్పు
- ప్రభుత్వంపై పోరుకు సిద్ధమంటున్న 'రాప్తాడు' రైతులు



ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం వద్ద హంద్రీ నీవా కాలువలో పూర్తయిన కాంక్రీట్ లైనింగ్ పనులు

ఆత్మకూరు: జిల్లాలో రైతు మనుగడను కూటమి ప్రభుత్వం ప్రశ్నార్థకం చేస్తోంది. కుప్పం ప్రాంతానికి హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకెళ్లాలనే సీఎం చంద్రబాబు స్వార్థపూరిత నిర్ణయం రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ రాప్తాడు నియోజకవర్గ రైతులు ఉద్యమ కార్యాచరణతో ముందుకు సాగేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఈ నెల 29 నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రకటించారు.

టీడీపీ నేతల్లోనూ వ్యతిరేకత

కరువు పీడిత రాయలసీమను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా హంద్రీ–నీవా ప్రాజెక్ట్ చేపట్టి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. కాలువలో నీరు ప్రవహించే సమయంలో ఎంతో కొంత నీరు భూమిలోకి ఇంకడం ద్వారా చుట్టుపక్కల బోరుబావుల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. దీంతో జిల్లాలో ఉద్యాన పంటలు గణనీయంగా విస్తరించాయి. తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీ–నీవా కాలువ సామర్థ్యాన్ని 83 టీఎంసీలకు పెంచుతూ పనులకు పరిపాలన అనుమతులు జారీ చేశారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి రాకపోవడంతో ఈ పనులు ముందుకు సాగలేదు. అనంతరం ఈ పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. తన సొంత నియోజకవర్గం కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు కాలువకు లైనింగ్ పనులను సీఎం చంద్రబాబు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే భూగర్భ జలాలు తగ్గిపోయి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాలు బీళ్లుగా మారుతాయి. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు సైతం ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో లైనింగ్ పనులను అడ్డుకున్నారు.

వట్టిపోనున్న చెరువులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ హంద్రీ–నీవా ద్వారా కొత్త ప్రాజెక్టులకు కూడా నీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు (కర్నూలు తాగునీటి పథకం)కు 3 టీఎంసీలు, డోన్‌లో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా 63 చెరువులకు నీరు ఇచ్చేందుకు 2 టీఎంసీలు, జిల్లాలోని శింగనమల చెరువుకు 1 టీఎంసీ, శింగనమల పాత తాలూకాలోని చెరువులకు 1.3 టీఎంసీలు, జీడిపల్లి, భైరవానితిప్ప, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు 3.7 టీఎంసీలు, అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు, సోమరాండ్లపల్లి రిజర్వాయర్, ముట్టాల, తోపుదుర్తి రిజర్వాయర్లకు 4.5 టీఎంసీలు, శ్రీసత్యసాయి జిల్లాలోని 193 చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 3 టీఎంసీలు, కొత్త ప్రాజెక్టులకు 23 టీఎంసీలు కేటాయించడంతో పాటు 40 టీఎంసీల నీటిని రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు అందించేలా బృహత్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. కాలువకు లైనింగ్ పనులు చేయడం ద్వారా భవిష్యత్తులో నీరంతా దిగువకు వెళ్లిపోయి చెరువులన్నీ పూర్తిగా వట్టిపోయే ప్రమాదం నెలకొంది.

అన్యాయం జరుగుతోంది



హంద్రీ–నీవా కాలువకు చేపట్టిన కాంక్రీట్ లైనింగ్ పనులతో ఒక్క రాప్తాడు నియోజకవర్గమే కాదు... మొత్తం రాయలసీమకే అన్యాయం జరుగుతోంది. రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు నీరు అందకుండా పోతాయి. భూములు బీళ్లుగా మారే అవకాశం ఉంది. ఈ అన్యాయాన్ని ప్రతిఘటించకపోతే రైతు మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. రైతులకు అన్యాయం జరగకుండా రిలే నిరాహార దీక్షలు రాప్తాడు నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తాం. రాజకీయాలకు అతీతంగా రైతులంతా ఉద్యమించాలి. ఈ రిలే నిరాహార దీక్షలకు సంబంధించి ఇప్పటికే అధికారులకు, పోలీసులకు అనుమతులు కోరాం.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

పంటల సాగు కష్టం



రాప్తాడు నియోజకవర్గంలో చాలా పొలాలు హంద్రీ–నీవా కాలువ పక్కనే ఉన్నాయి. హంద్రీ–నీవా కాలువలో నీటి ప్రవాహం వల్ల భూగర్భ జలాలు పెరిగి మా వ్యవసాయ బోరు బావుల్లో నీటి లభ్యత పెరిగింది. దీంతో నాకున్న 4 ఎకరాల్లో చీనీ పంట సాగు చేశా. ఇప్పుడేమో కాలువకు లైనింగ్ పనులు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీటి లభ్యత లేక పంటలు సాగు చేయడం కష్టమవుతుంది. రైతు కష్టాన్ని ప్రభుత్వం ఒకసారి ఆలోచించాలి. లైనింగ్ పనులు ఆపి 83 టీఎంసీల నీటి ప్రవాహం ఉండేలా కాలువను వెడల్పు చేయాలి.

– సుబ్బర రామాంజినేయులు, సిద్ధరాంపురం, ఆత్మకూరు మండలం

రైతుల పొట్ట కొట్టొద్దు



హంద్రీ–నీవాలో నీటి ప్రవాహం వల్ల చాలా మంది బోరు బావుల్లో నీటి మట్టం పెరిగింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా కాలువ పక్కన పొలాల్లో చీనీ, అరటి, టమాట, వరి, అంజూర, ద్రాక్ష, దానిమ్మ వంటి ఉద్యాన పంటల సాగు పెరిగింది. హంద్రీ–నీవా కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయితే బోర్లు ఎండి పోయే ప్రమాదముంది. రైతులు నష్టపోతారు. కాంక్రీట్ లైనింగ్ పనులతో రైతుల పొట్ట కొట్టొద్దని ఈ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

– వెంకటేష్, సింగంపల్లి, ఆత్మకూరు మండలం

ప్రియుడి వ్యసనాలు నచ్చక యువతి ఆత్మహత్య



మృతురాలు రక్షిత

అగళి: చెడు వ్యసనాలు మానాలని చెప్పినా ప్రియుడు వినకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం ఎం.రాయపురం గ్రామానికి చెందిన రాజన్న కుమారుడు పునీత్, అగళికి చెందిన దళిత సన్న భూతన్న, కారియమ్మ దంపతుల మూడో కుమార్తె రక్షిత (22) ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకున్నారు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాల పెద్దలు వారి పెళ్లికి అంగీకారం తెలిపారు. ఆగస్టులో ఇద్దరికీ పెళ్లి చేయాలని ముహూర్తం కూడా నిశ్చయించారు. ఈ క్రమంలో పునీత్ రోజూ రక్షితకు ఫోన్ చేసి మాట్లాడేవాడు. మాటల్లో పునీత్ వ్యసన పరుడని రక్షిత గుర్తించింది. ఆయనకు తాగుడు అలవాటుతో పాటు ఇతర దురలవాట్లూ ఉన్నాయని తెలుసుకున్న ఆమె వాటిని మానుకోవాలని ప్రాధేయపడింది. అయినా పునీత్‌లో మార్పు రాలేదు. ఈ విషయం ఇంట్లో వారికి చెప్పుకోలేక తనలో తాను కుమిలిపోతూ వచ్చింది. రేపు పెళ్లి తర్వాత ఇంటి అల్లుడు వ్యసనపరుడని తెలిస్తే పుట్టింటి వారి గౌరవానికి భంగం కలుగుతుందని భావించిన ఆమె సోమవారం రాత్రి ఇంట్లోనే పైకప్పునకు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కాపాడి స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్ణాటకలోని శిరలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనకు సంబంధించి సన్న భూతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అగళి పీఎస్ ఎస్ఐ వీరేష్ తెలిపారు.

డీఈఈ సెట్ నిర్వహణకు రెండు కేంద్రాలు



అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ డిప్లొమా ఇన్ ఎలమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈ సెట్)–2025కు జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జూన్ 2న మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరిగే పరీక్షలకు నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా (చిన్మయానగర్, ప్రసన్నాయపల్లి పంచాయతీ), రాప్తాడు మండలం హంపాపురం వద్ద ఉన్న ఎస్వీఐటీ కళాశాల కేంద్రాలుగా ఉంటాయన్నారు. https://apdeecet.apcfss.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. నిర్ణీత సమయానికి గంట ముందే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని, హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదో ఒకటి వెంట తెచ్చుకోవాలని సూచించారు.

తప్పులతడక.. గందరగోళం

- హెచ్ఎంల సీనియార్టీ పదోన్నతుల జాబితాలో తప్పులు
- సీనియర్లకు తీరని అన్యాయం జరుగుతోందంటూ ఆవేదన
- కోర్టుకెళ్తామంటున్న బాధిత టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కోసం అధికారులు అనుసరిస్తున్న విధానంతో సీనియార్టీ జాబితా గందరగోళంగా మారిందంటూ టీచర్లు వాపోతున్నారు. సాధారణంగా కామన్ సీనియారిటీ లెక్కించేటపుడు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పొందిన వారికి వారి ర్యాంకుల ప్రకారం వివిధ సబ్జెక్ట్‌లను కలుపుతూ సీనియార్టీ జాబితా తయారు చేస్తారు. కానీ ఎస్జీటీ నుంచి పాఠశాల సహాయకులుగా ముఖ్యంగా ఒకే డీఎస్సీలో ఎస్జీటీగా ఎన్నికై ఒకేరోజు పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్లతో ఉమ్మడి సీనియార్టీ తయారు చేసేటప్పుడు వారి ఫీడర్ కేటగిరీ (ఎస్జీటీ)లో మెరిట్‌ను ప్రాతిపదికగా తీసుకుంటారు. ఏళ్ల తరబడే ఇదే విధానం కొనసాగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుత పదోన్నతుల్లో ఈ విధానాన్ని పక్కన పెట్టి సీనియార్టీ జాబితాను తయారు చేయడంతో సీనియర్లకు అన్యాయం జరుగుతోందంటున్నారు.

మెరిట్‌కు మంగళం...

ప్రాథమిక నిబంధనలు–34 ప్రకారం కామన్ సీనియారిటీకి ముందు వారి సబ్జెక్ట్ లో సీనియారిటీకి భంగం వాటిల్లకూడదు. అంటే ఆయా సబ్జెక్ట్‌లలో మెరిట్ ఆధారంగా వారి సీనియారిటీ నిర్ణయించబడి ఉంటుంది. నేరుగా స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికైన వారి సీనియార్టీ జాబితా మొత్తం మెరిట్ ఆధారంగానే తయారు చేశారు. వీరి తర్వాత పదోన్నతుల ద్వారా స్కూల్ అసిస్టెంట్లుగా వచ్చారో వారి సీనియార్టీ జాబితా తయారు చేసేటప్పుడు గందరగోళం చేశారు. అన్ని సబ్జెక్ట్ లను కలిపినపుడు సైతం మెరిట్ ప్రాతిపదికగా తీసుకుంటే మాత్రమే సీనియారిటీ కచ్చితంగా వస్తుందని టీచర్లు చెబుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అటు మెరిట్ కాకుండా, ఇటు రోస్టర్ కాకుండా, వయస్సు వారీగా కూడా కాకుండా విచిత్రమైన పద్ధతిలో జాబితా తయారు చేశారంటున్నారు. ఇక్కడ మెరిట్ మొత్తం తిరగబడి, క్రమ పద్ధతి లేకుండా జూనియర్లుపైన, సీనియర్లు కింద ఉన్నారంటున్నారు.

ఇదిగో ఇలా...

1994 డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై...2002 నవంబరులో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన వారి సీనియార్టీ జాబితాలో పరిశీలిస్తే..డీఎస్సీలో 36వ మెరిట్ ర్యాంకుగా ఉన్న టీచరు కంటే కూడా 397 ర్యాంకు టీచరును ముందు పెట్టారు. 99వ ర్యాంకుగా ఉన్న టీచరుకంటే కూడా 161, 378, 141, 373 ర్యాంకు టీచర్లు ముందున్నారు. ఈ ఐదుగురూ (99,161,378,141,373 ర్యాంకర్లు) కూడా 36 ర్యాంకు టీచరుకంటే ముందున్నారు. అందరూ ఓపెన్ కేటగిరీ టీచర్లు కావడం విశేషం.

కోర్టుకు వెళ్లే ఆలోచనలో టీచర్లు..

హెచ్ఎం పదోన్నతులకు తయారు చేసిన సీనియార్టీ జాబితాలో మెరిట్‌ను తుంగలో తొక్కి, సీనియర్లకు అన్యాయం చేయడంపై బాధిత టీచర్లు హైకోర్టును ఆశ్రయించేందుకు సమాయత్తమవుతున్నారు. 20 ఏళ్లకు పైగా ప్రమోషన్స్ లేక ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులను వింత పద్ధతి మరింత దెబ్బ తీస్తోందంటూ వాపోతున్నారు. మూడు నెలల క్రితం తయారు చేసిన జాబితా మెరిట్ ఆధారంగానే ఉందని... తాజా జాబితా తలకిందులుగా ఉందంటున్నారు. ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయిస్తామంటున్నారు.

చౌకధరల దుకాణాల వద్దే రేషన్ పంపిణీ

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జూన్ నెలకు సంబంధించిన రేషన్ సరుకులను చౌకధరల దుకాణాల వద్దే పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్డుదారులు ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల వద్ద రేషన్ సరుకులు పొందవచ్చన్నారు. డీలర్లు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు నిత్యావసర సరుకుల అందించాలన్నారు. ధరల్లో, తూకాల్లో తేడాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలన్నారు. రేషన్ సరుకులు పంపిణీలో అక్రమాలు చోటు చేసుకోకుండా ఆయా మండలాల తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు పర్యవేక్షించాలని ఆదేశించారు.

రేపటి నుంచి రైతుల వద్దకే శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా ప్రయోగశాల నుంచి భూమికి అనే నినాదంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 29 నుంచి జూన్12వ తేదీ వరకు రైతుల వద్దకే శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. రోజూ 3 గ్రామాలు చొప్పున 32 మండలాల్లోని గ్రామాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సందర్శించి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, భూసార పరీక్షలు, డ్రోన్ వినియోగం, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

బాలిక బలవన్మరణం

తాడిపత్రి టౌన్: స్థానిక సీపీఐ కాలనీకి చెందిన రజని (16) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కాలనీకి చెందిన చాకలి పుల్లయ్య, రాజేశ్వరి దంపతుల కుమార్తె రజని ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఫలితాలు అందిన రోజున తల్లిదండ్రులు విజయవాడలోని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదివిస్తామని చెప్పడంతో సంతోష పడింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో మూడు రోజుల క్రితం తాడిపత్రిలోనే చదువుకోవాలని తల్లిదండ్రులు సూచించారు. దీంతో క్షణికావేశానికి లోనైన బాలిక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

బలవంతపు పెళ్లిపై ఫిర్యాదు

గుమ్మఘట్ట: తనకు ఇష్టం లేకపోయినా కుటుంబ సభ్యులు బలవంతంగా పెళ్లి చేశారంటూ పోలీసులకు ఓ బాలిక ఫిర్యాదు చేసింది. వివరాలు.. రాయదుర్గం పట్టణానికి చెందిన వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్దమ్మాయిని గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. ఈ క్రమంలోనే మైనారిటీ తీరని రెండో అమ్మాయిని కూడా నెల రోజుల క్రితం పూలకుంట గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. అయితే అప్పటికే అతనికి వివాహమై ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఈ పెళ్లి ఇష్టం లేని బాలిక స్థానికుల సహకారంతో తప్పించుకుని నేరుగా ఎస్పీని ఆశ్రయించింది. తనకు ఇష్టం లేకపోయినా బలవంతంగా పెళ్లి చేశారని వాపోయింది. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో యువకుడి మృతి



హనుమంత రాయుడు (ఫైల్)

బెళుగుప్ప: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం అంకంపల్లికి చెందిన ఆవుల హనుమంతరాయుడు (34)కు భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి రహదారి పక్కనే ఉన్న గోడను ఢీకొని సమీపంలోని గుంతలోకి దూసుకెళ్లాడు. ఘటనలో తలకు, ఛాతీకి బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్న హనుమంతరాయుడిని స్థానికులు, కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

రాత్రంతా సాగిన బదిలీల కౌన్సెలింగ్

- ఆన్‌లైన్ అంటూనే భౌతికంగా సాగిన కౌన్సెలింగ్



మంగళవారం తెల్లవారుజామున బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన మహిళా ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఉదయం మొదలైన జోనల్ స్థాయి ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం తెల్లవారుజాము సరిగ్గా 6 గంటలకు ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జోనల్ స్థాయి కావడంతో ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ముగ్గురు సూపరెండెండెంట్లు, 31 మంది సీనియర్ అసిస్టెంట్లు, 19 మంది ఏడీఏలు, 118 మంది ఏఓలతో పాటు రిక్వెస్ట్ కింద ఐదుగురు సూపరెండెండెంట్లు, 32 మంది సీనియర్ అసిస్టెంట్లు, 26 మంది ఏడీఏలు, 122 మంది ఏఓలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరితో పాటు వివిధ విభాగాల అసోసియేషన్లకు చెందిన నాయకులు తరలిరావడంతో జాతరను తలపించింది. ఇందులోనూ ఎక్కువగా మహిళా ఉద్యోగులు తరలివచ్చారు. 255 మందికి పైగా కౌన్సెలింగ్‌కు హాజరవుతున్నట్లు తెలిసినా కౌన్సెలింగ్ ప్రక్రియ జాప్యం చేయడం, సమయ పాలన పాటించకపోవడం, రాత్రంతా వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళా ఉద్యోగులు జాగరణతో పడిగాపులు కాసేలా చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆన్‌లైన్ ప్రక్రియ అంటూనే భౌతికంగా చేపట్టారు. ప్రతి విషయంలో ఒకరిద్దరు జేడీఏలు జోక్యం చేసుకోవడంతో ఆలస్యమైనట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఏఓ స్థాయి అధికారులు రాత్రంతా నిద్రలేకుండా గడిపారు. అలాగే రిక్వెస్ట్ కింద, అసోసియేషన్ల వెనులుబాటు, కొందరు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో సదరు ప్రజాప్రతినిధులు అధికారులపై సీరియస్ అయినట్లు తెలుస్తోంది.

పీఆర్‌లో సజావుగా బదిలీల కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న పీఆర్ ఈఎన్‌సీ బాలూనాయక్, ఎస్ఈ జహీర్ అస్లాం, తదితరులు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ (పీఆర్) శాఖకు సంబంధించి అనంతపురంలోని పీఆర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి (రాయలసీమ జిల్లాలు) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, బాలాజీ (తిరుపతి), చిత్తూరు, నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన డీఈఈలు, ఏఈఈలు, జేఈఈలు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టెక్నికల్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగింది. ఆ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) బాలూనాయక్, ఎస్ఈ జహీర్ అస్లాం, శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఈ మురళి, ఇతర జిల్లాల ఎస్ఈలతో పాటు పీఆర్ఐ ఈఈ ప్రభాకరరెడ్డి, అనంతపురం సబ్ డివిజన్–1, 2 డీఈఈలు లక్ష్మీనారాయణ, కృష్ణజ్యోతి, సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఖాజా మొహిద్దీన్ తదితరులు పర్యవేక్షించారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్ బదిలీలనూ ఆమోదించారు.

సజావుగా హెల్త్ అసిస్టెంట్ల బదిలీలు

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లా ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ మంగళవారం అనంతపురంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో సజావుగా సాగింది. ప్రభుత్వ రీడిప్లాయ్‌మెంట్ ఆదేశాల మేరకు 215 మందిని సీనియారిటీ ప్రాతిపదికన వారు ఇచ్చిన ఆప్షన్ మేరకు ప్లేస్‌మెంట్ కల్పించినట్లు డీఎంహెచ్ఓ ఈ భ్రమరాంబదేవి తెలిపారు. ఏఓ గిరిజా మనోహర్‌రావు, మలేరియా అధికారి ఓబులు, కార్యాలయ పర్యవేక్షణ అధికారులు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్లు పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.